క్లుప్తంగా

జీజీహెచ్ వద్ద ధర్నా

గుంటూరు మెడికల్: రోడ్డు ప్రమాదంలో తమ బిడ్డ మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలని కోరుతూ గుంటూరు జీజీహెచ్ మార్చురీ వద్ద మృతుడి బంధువులు సోమవారం ఆందోళన చేశారు. మేడికొండూరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన సంకు బ్రమేశ్వరావు ను(37) ఆదివారం రాత్రి క్రషర్ లారీ ఢీకొట్టగా మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, సంబంధిత క్రషర్ యజమాని మృతునికి కుమార్తెలకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ



గుంటూరు మెడికల్: టీకాలు క్రమం తప్పకుండా వేయించడం ద్వారా అనేక వ్యాధుల నుంచి రక్షించవచ్చని డీఎంహెచ్ఓ కొర్రా విజయలక్ష్మి అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు, జీజీహెచ్‌లో పనిచేస్తున్న వైద్యాధికారులకు రొటీన్ ఇమ్యూనైజేషన్ కొత్త మ్యాన్యువల్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భిణులకు, ఐదేళ్లలోపు చిన్నారులకు కొత్త మ్యాన్యువల్ ప్రకారం టీకాల వేయాలన్నారు. టీకాల కార్యక్రమాన్ని ప్రణాళికా యుతంగా అమలు చేయాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు మాట్లాడుతూ సవరించిన టీకాల ప్రణాళిక ప్రాముఖ్యత గురించి వివరించారు. సార్వత్రిక వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం అమలు పరచవలెనని వైద్యాధికారులకు ఆదేశించారు. సమావేశంలో సర్వేలెన్స్ వైద్యాధికారి జి.భవాని పాల్గొన్నారు.

హెచ్ఐవీపై కళాజాతా

గుంటూరు మెడికల్: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ కళాజాతా బృందాతో సోమవారం గుంటూరు మిర్చి యార్డులో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ ఏ విధంగా సోకుతుంది, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై కళాకారులు రైతులు, కార్మికులకు వివరించారు. కార్యక్రమంలో హ్యాపెన్ పీయూ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ జి.విల్సన్, ఓఆర్ డబ్ల్యూ సురేష్, ఏఎస్ఎం అమ్మాజీ పాల్గొన్నారు.

అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్



గుంటూరు మెడికల్: ఉచిత వైద్య శిబిరాలను పేదలు వినియోగించుకోవాలని అహల్య ట్రస్టు నిర్వాహకులు, ఐవీఎఫ్ స్పెషలిస్టు డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. సోమవారం స్వర్ణ భారతి నగర్‌లో అహల్య ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ గర్భిణులు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కాన్పు సమయంలో తల్లీబిడ్డ క్షేమంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వైద్య శిబిరంలో సుమారు 250 మందికి పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శిరీష, డాక్టర్ హేమ, అహల్య హాస్పిటల్ సిబ్బంది, 56 వ వార్డు కార్పొరేటర్ పద్మజ పాల్గొన్నారు.

నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం

నెహ్రూనగర్: నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం అందించడంలో రాజీ లేదని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర స్పష్టం చేశారు. సోమవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, నోడల్ అధికారులు, విభాగాధిపతులతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడంలో పారిశుద్ధ్యం అత్యంత కీలకమని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎస్ఈ నాగామల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సెక్రటరీ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జి పనులు ప్రారంభించాలి

లక్ష్మీపురం: నగర నడి బొడ్డున ఉన్న మూడు వంతెనలు శాశ్వత పరిష్కారం చూపిన తరువాత మాత్రమే శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఏఐవైఎఫ్ షేక్ వలి డిమాండ్ చేశారు. కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఇటీవల మూడు వంతెనల నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. రూ.13 కోట్ల రూపాయల ప్రజాధనం వృథా చేసిందన్నారు.

స్ట్రీట్ వెండింగ్ పాలసీపై సందిగ్ధం!

- కార్పొరేషన్‌కు ప్రతి ఏడాది రూ.3 కోట్లు నష్టం
- గుజ్జనగుండ్లలో జోన్ ఏర్పాటుకు స్థల పరిశీలన
- ఆచరణలో కనిపించడం లేదు



వీధి వ్యాపారులకు రసీదు అందజేస్తున్న కమిషనర్(ఫైల్)

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో స్ట్రీట్ వెండింగ్ పాలసీ అమలు కాకపోవడంతో ప్రతి ఏడాది కార్పొరేషన్‌కు రూ.3 కోట్లు దాకా నష్టం వస్తోంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తేనే తప్ప తోపుడు బండ్లు వద్ద నుంచి ఆశీలు వసూలు చేసుకునే వెసులుబాటు ఉండదు. దీనికి సంబంధించి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అటు ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో దళారులు దర్జాగా స్ట్రీట్ వెండింగ్ పాలసీ కింద నగరంలో వసూలుకు పాల్పడుతూ దోచుకుంటున్నారు.

గుజ్జనగుండ్ల సెంటర్‌లో పెట్టాలని...!

నగరంలో రోజు రోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని నగరపాలక సంస్థ పరిధిలో వీధుల వెంట వ్యాపారం చేసుకునే వారిని తొలగించి వారికి ప్రత్యేకంగా ఒక ప్రాంతంలో వ్యాపారం చేసుకునే విధంగా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గల్లా మాధవి, ప్రయత్నాలు చేసి గుజ్జనగుండ్లలో వెండింగ్ జోన్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే ఇంకా ఆచరణలోకి రాలేదు.

మళ్లీ సర్వేకు చర్యలు

రోడ్లు వెంట వ్యాపారం చేసుకునే వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా జోన్లు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారం చేసుకునే వారిపై కొంత మంది వసూళ్లకు పాల్పడడంతో పాటు, చైన్‌మెన్‌లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఈ నెల 7వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ఆరోపించారు. దీనిపై కమిషనర్ తిరిగి నగరంలో వీధి వ్యాపారులు ఎంత మంది ఉన్నారో సర్వే చేయాలని వార్డు సచివాలయ ఉద్యోగులకు విధులు కేటాయించారు. ప్రభుత్వానికి నివేదించేందుకు చర్యలు చేపట్టారు.

కొత్త గుర్తింపు కార్డులూ లేవు..

నగరంలో సుమారు 20 వేలకు పైగా వీధి వ్యాపారులు ఉన్నారు. గతంలో ఇచ్చిన వీధి వ్యాపారులకు ఇచ్చిన గుర్తింపు కార్డులను కొంత మంది దుర్వినియోగం చేశారనే కారణంతో ప్రస్తుత కమిషనర్ పులి శ్రీనివాసులు వీధి వ్యాపారులు తిరిగి కొత్తగా ఐడీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వ్యాపారులు ఐడీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇంత వరకు ఐడీ కార్డులు ఇచ్చిన పాపన పోలేదు.

గతంలోనే వెండింగ్ జోన్లు ఏర్పాటు

నగరపాలక సంస్థ పరిధిలో మూడు జోన్లు పట్టణ ప్రణాళిక అధికారులు ఏర్పాటు చేశారు. రెడ్‌జోన్ పరిధి మినహా గ్రీన్ జోన్ పరిధి, అంబర్ జోన్ పరిధిలో వ్యాపారం చేసుకునే వారికి గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు గత ప్రభుత్వ హయాంలోనే కార్యాచరణ సిద్ధం చేశారు. అయితే 2022లో స్ట్రీట్ వెండింగ్ పాలసీపై కొంత మంది కోర్టును ఆశ్రయించడంతో ఆశీలు వసూలు చేయకూడదని స్పష్టం చేయడంతో ఆశీలు వసూలు చేయకుండా నగర పాలక సంస్థ నిలిపివేసింది. దీంతో రెండు మూడు సంవత్సరాలుగా నగరపాలక సంస్థ టెండర్ నిర్వహించకపోవడంతో రూ.3 కోట్లు దాకా కార్పొరేషన్ ఆదాయానికి గండిపడింది.

గతంలో జోన్లు వివరాలివే..

గ్రీన్ జోన్ పరిధి..బస్టాండ్ ఎదురు రోడ్డు, ఓల్డ్ క్లబ్ రోడ్డు నార్తరన్ సైడ్, 0 లైన్స్, అరండల్‌పేట, అంతర్గత రోడ్లు. ఈ గ్రీన్ జోన్‌లో వీధి వ్యాపారస్తులు వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

అంబర్ జోన్ పరిధి

నక్షత్ర హోటల్ నుంచి బృందావన్‌గార్డెన్స్, అరండల్‌పేట ఒకటి నుంచి 18 లైన్, బ్రాడీపేట ఒకటి నుంచి 5 లైన్లు, రైల్వే స్టేషన్ ఎదురు రోడ్డు, చుట్టుగుంట రోడ్డు, పట్నంబజారు, అంబర్ జోన్ పరిధిలో ఉన్నాయి. ఇందులో ఫ్యాన్సీ ఐటమ్స్ విక్రయాలు ఉంటాయి.

రెడ్ జోన్ పరిధి

రైల్వే ఓవర్ బ్రిడ్జి టూ లాడ్జిసెంటర్, 4/1 బ్రాడీపేట, లక్ష్మీపురం మదర్ థెరిస్సా టూ హాలివుడ్ సినిమా హాల్, జిన్నా టవర్ టూ హిమని ఐస్ క్రీం సెంటర్, నాజ్ సెంటర్ టూ రైల్వే స్టేషన్, పల్నాడు బస్టాండ్, కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, కొరిటెపాడు మెయిన్‌రోడ్డు, ఇన్నర్‌రింగ్ రోడ్డు, పొన్నూరు రోడ్డు, గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి రోడ్డు, ఉమెన్స్ కాలేజీ రోడ్డు, మణిపురం బ్రిడ్జి టూ జిన్నా టవర్, జీటీ రోడ్డు నుంచి చుట్టుగుంట వరకు , లాడ్జిసెంటర్ నుంచి చిల్లీస్ రెస్టారెంట్ వరకు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఈ రెడ్ జోన్‌లో ఎక్కడ కూడా వీధి వ్యాపారులు వ్యాపారం చేయకూడదు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా



మహిళ నేతలతో మాట్లాడుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ మహిళ నేతలు పోరాటాలకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా కోరారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో సోమవారం నగరంలోని డివిజన్ స్థాయి మహిళ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు సంబంధించి పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మ ఒడి, మహిళలకు సంబంధించి పలు పథకాలకు మంగళం పాడారని దుయ్యబట్టారు. వీటిపై ప్రతి డివిజన్‌లో మహిళల అభిప్రాయాలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ నేతలకు తెలియజేసి, వాటిపై పోరాడేందుకు సిద్ధం కావాలన్నారు. ఎక్కడా వృద్ధులు, మహిళలు, వితంతువులకు సంబంధించి ఏ సమస్య ఉన్న తక్షణమే డివిజన్ స్థాయి మహిళ నేతలు వెళ్లడంతోపాటు, నాయకులకు తెలియజేసి, క్షణాల వ్యవధిలో వచ్చి తమవంతు సహకారాన్ని అందిస్తామన్నారు.

వైఎస్ జగన్ అంటే సుపరిపాలన, నమ్మకమైన నాయకత్వం

వైఎస్సార్ సీపీ ఎన్నారై విభాగం గ్లోబల్ కో–ఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి



మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: సుపరిపాలన, నమ్మకమైన నాయకత్వానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శాశ్వత చిరునామాగా నిలిచారని వైఎస్సార్ సీపీ ఎన్నారై విభాగం గ్లోబల్ కో–ఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. అవర్ స్టేట్ అవర్ లీడర్ వైఎస్సార్ సీపీ సింగపూర్ కో–ఆర్డినేటర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో సింగపూర్‌లో వైఎస్సార్ సీపీ గ్లోబల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ 15 వేల గ్రామ, వార్డు సచివాలయాలు, 2.6 లక్షల గ్రామ వలంటీర్లు, 17 మెడికల్ కాలేజీలు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, ఆరోగ్య శ్రీ పరిధి 3000 లకుపైగా చికిత్సలకు విస్తరణ, విద్యారంగంలో నాడు– నేడు ద్వారా 50 వేలకు పైగా పాఠశాలలు ఆధునికీకరణ, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు, ఆర్థికాభివృద్ధికై రూ.13 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు, రూ.4.47 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాల్లోకి జమ, 11.43 శాతం జీడీపీ వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో నెంబర్ వన్ చేశారన్నారు. వైఎస్ జగన్ అందించిన సుపరిపాలన భవిష్యత్‌లో మరే నాయకుడు అందించలేనిదని అన్నారు. సమావేశంలో సింగపూర్ కోటిరెడ్డి, మురళి, అవర్ స్టేట్ అవర్ లీడర్ సభ్యులు పాల్గొన్నారని గుంటూరుకు చెందిన అవర్ స్టేట్ అవర్ లీడర్ అధ్యక్షుడు జి.శాంతమూర్తి తెలిపారు.

సకాలంలో అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను బాధ్యతగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 24 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడారు. ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని కోరారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌కు 40 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 23, ఇంజినీరింగ్ విభాగానికి 5, రెవెన్యూ విభాగానికి 9, ప్రజారోగ్య విభాగానికి 3 ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డీసీపీ సూరజ్, ఉపా సెల్ పిఓ రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

జూన్ 5న ‘చలో విజయవాడ’



గుంటూరు మెడికల్: జూన్ 5వ తేదీ నిర్వహించనున్న ‘చలో విజయవాడ’ పోస్టర్‌ను జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాషా సోమవారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై జూన్ 5న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లాషా ఖాదిరి, జిల్లా కోశాధికారి పోతురాజు సంయుక్త కార్యదర్శి విజయబాబు, లక్ష్మీనారాయణ, మురళి, పొన్నూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు, హరిబాబు, తాడికొండ తాలూకా యూనిట్ అధ్యక్షుడు సుబ్బారావు, నగరశాఖ అధ్యక్షుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు అరుణ కుమారి, రోజా, పద్మజ, ప్రభావతి, అలీషు, నీలి మా, రమణి పాల్గొన్నారు.

‘పాలస్తీనా ముఖచిత్రం’ పుస్తక ఆవిష్కరణ సభ



లక్ష్మీపురం: పాలస్తీనా ప్రజలు చేస్తున్న పోరాటం తమ మాతృ భూమి రక్షణ కోసం, తమ మనుగడ కోసం అని రైతు కూలీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.వీరబాబు అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ హాల్‌లో పాలస్తీనా ముఖచిత్రం పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. సమావేశానికి రైతు కూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) జిల్లా కార్యదర్శి ఉల్లిగడ్డల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కొద్ది కాలంలోనే పాలస్తీనాలో 52 వేల మంది చనిపోగా అందులో 70 శాతం మహిళలు చిన్నపిల్లలు ఉన్నారన్నారు. సభలో జన సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దివి కుమార్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బసవలింగారావు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి లక్ష తులసి పూజ



నగరంపాలెం: కొత్తపేట(నాజ్ కూడలి)లోని ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమత్ జయంత్యుత్సవాలు సోమవారానికి రెండో రోజుకి చేరాయి. ఉదయం పంచామృత స్నపన, స్వామికి లక్ష తులసి పూజ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. శ్రీ హనుమాన్ దీక్షా సమాజం అధ్యక్షుడు తిరువళ్ళూరు వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో నినర్వహించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ టి.సుభద్ర పర్యవేక్షించారు. కార్యక్రమంలో దీక్షా సమాజం సభ్యులు నాగేశ్వరరావు, వంశీ ప్రసాద్, రమేష్, వెంకటరమణ, మారుతి, సుబ్రహ్మణ్యం, బాపిరాజు పాల్గొన్నారు.

22 నుంచి హనుమత్ జయంతి మహోత్సవాలు

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని శ్రీకంచి కామకోటిపీఠ శ్రీమారుతి దేవాలయ ప్రాంగణంలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు హనుమాన్ జయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం 108 పర్యాయలు హనుమాన్ చాలీసా పారాయణం, ఆంజనేయస్వామికి విశేష ఆకు పూజలు, సాయంత్రం శారద రామలింగేశ్వర భజన సమాజం ఆధ్వర్యంలో భక్తి సంకీర్తన ఉంటుందని అన్నారు. 23న ఉదయం తొమ్మిది గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, లక్ష మల్లె అర్చన, 24 ఉదయం ఊరేగింపు, సాయంత్రం సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. 25 ఉదయం తొమ్మిది గంటలకు దీక్షాదారుల ఇరుముడి ప్రదక్షిణాలు, భక్తి సంకీర్తన నడుమ హనుమ రుద్ర హోమం, హనుమద్ దీక్షాదారులతో పూర్ణాహుతి చేపడతామని వివరించారు.

వైభవంగా పుష్పయాగం



నగరంపాలెం: స్థానిక పాతగుంటూరు విశాఖ శారదాపీఠ పరిపాలిత వీరాంజనేయస్వామి దేవస్థానం హనుమత్ జయంతి మహోత్సవాలు సోమవారం రెండో రోజు కొనసాగాయి. ఉదయం ప్రభాతసేవ, ఆలయం ప్రదక్షిణలు, మంత్ర పుష్పం, తీర్థ గోష్టి జరిగాయి. స్వామి వారి మూల విరాట్‌నకు శ్రీపుష్పయాగం వైభవంగా నిర్వహించారు. రామనామ సంకీర్తనలతో ఆలయం మార్మోగిపోయింది. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, సభ్యులు ఆత్మకూరి లక్ష్మణరావు, సురేంద్రకుమార్, తవ్వా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆస్తి వివాదంలో సోదరుడిపై దాడి

లక్ష్మీపురం: ఆస్తి పంపకం అన్నపై తమ్ముడు ఇనుప కడ్డీతో దాడిచేసిన ఘటన చోటుచేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. వసంతరాయపురానికి చెందిన జమిళ్లమూడి గురువయ్య, అతని తమ్ముడు నాగరాజు మధ్య తండ్రి ద్వారా సంక్రమించిన స్థలం పంపకం విషయమై గత కొంత కాలంగా వివాదం ఉంది. ఈ వివాదంతో తమ్ముడు నాగరాజు పలు మార్లు మద్యం తాగి గొడ్డలి తీసుకుని సోదరుడు గురువయ్య ఇంటికి గొడవ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి నాగరాజు మద్యం మత్తులో సోదరుడు గురవయ్య ఇంటి మీదకు వెళ్లి ఇనుప కడ్డీతో తలపై కొట్టి గాయాలపాలు చేశాడు. దీంతో స్థానికులు, కుటుంబ సభ్యులు జోక్యం చేసుకుని గురువయ్యను ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య

పట్నంబజారు: పల్నాడు జిల్లాలో టీడీపీ గుండాలు ‘సాక్షి’ ఉమ్మడి జిల్లాల ఎలక్ట్రానిక్ మీడియా బ్యూరో అశోక్‌పై దాడిచేయడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ గులాం రసూల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జర్నలిస్టులపై దాడులు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే పోలీసు అధికారులు దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి



సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం నాయకుడు పాశం రామారావు కోరారు. బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సోమవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామారావు మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో తనవంతు పాత్ర నిర్వహించారని కొనియాడారు. పార్టీని నిర్మించి అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, చిన్న ప్రాజెక్టుల ప్రాధాన్యాన్ని పాలకులకు తెలిసేలా చేశారని చెప్పారు. విశాలాంధ్రలో ప్రజారాజ్యం కావాలని విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా పోరాటం నడిపారన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎ.వేణుగోపాలరావు, ఎం.డి.అక్బర్, కె.నళినికాంత్, బి.లక్ష్మణరావు, ఎం.ఎ.చిష్టీ, బి.సుధాకిరణ్, వై.కృష్ణకాంత్, బి.ముత్యాలరావు, ఎ.కళ్యాణి, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఎం.కళాధర్, ఎం.హనుమంతరావు, కాకుమాను నాగేశ్వరరావు, కాపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రగతినగర్ శాఖ ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: ప్రగతి నగర్ శాఖ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలతో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, నగర కార్యదర్శి కే నళికాంత్, అబ్దుల్ గని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో జన్మించి తన జీవితాంతం పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో తనవంతు పాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, కె.నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శి రాగి వెంకటేశ్వరరావు, మస్తాన్‌వలి, బాబు, ఫాతిమా ఓబులేశ్వరి, పాములు పాల్గొన్నారు.



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: రాజకీయాల్లో ఉన్నత విలువలను అందించిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలంయలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం బలహీన పడిన నేపథ్యంలో అత్యంత లాభదాయకమైన వ్యాపారంగా రాజకీయాలు మారిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. విశ్రాంత టెలికం అధికారి ఎస్.సదాశివం మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటాల నుంచి సుందరయ్య లాంటి మహానుభావులు రాజకీయాల్లో అడుగుపెట్టారన్నారు. విద్యావేత్త సింగరయ్య, జనార్ధన్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

లక్ష్మీపురం: మద్యం తాగి దంపతులపై దాడిచేసిన ఘటన అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శారదాకాలనీ 19వ లైన్‌కు చెందిన భుక్యా బాబు నాయక్, భార్య కమలాబాయి ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటారు. ఆదివారం రాత్రి స్థానికంగా కొంత మంది పిల్లలు బాబు నాయక్ ఇంటి ముందు టపాసులు కాలుస్తున్నారు. దీన్ని గమనించిన బాబు నాయక్ వారిని పక్కకు వెళ్లి కాల్చుకోవాలని సూచించాడు. అక్కడే మద్యం తాగి ఉన్న భాను ప్రసాద్, అతని స్నేహితులు పక్కకు వెళ్లమంటావా అంటూ బాబునాయక్, భార్య కమలాబాయిపై దాడికి పాల్పడ్డారు. బాధితులు ఆస్పత్రిలో చేరి సోమవారం రాత్రి అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ వ్యవస్థపై స్పష్టత ఇవ్వాలి

నెహ్రూనగర్: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. హేతుబద్ధీకరణ విధానంతో సచివాలయ వ్యవస్థలో మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, మూడు నెలల నుంచి ఈ వ్యవస్థలో జరుగుతున్న మార్పులపై సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందని చెప్పారు. సంఖ్యను తగ్గించడంతో పాటు ఉద్యోగుల సంఖ్యను కూడా ప్రభుత్వం తగ్గిస్తుందని, క్లస్టర్ విధానం తెచ్చి టెక్నికల్ ఫంక్షనరీస్‌ను కుదిస్తున్నారని, దీని ఫలితంగా సచివాలయ ఉద్యోగులపై తీవ్ర పని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల అభిప్రాయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహాభారతంపై ఆధ్యాత్మిక ప్రవచనం



మాట్లాడుతున్న కూర్మనాథస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మహా భారతంలోని అరణ్యపర్వంపై సోమవారం ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధ్యాత్మిక ప్రవచకులు గుదిమెళ్ల కూర్మనాథస్వామి అరణ్యపర్వం సోదాహరణగా వివరించారు.

యువకుడిపై దాడి

లక్ష్మీపురం: యువకుడిపై దాడిచేసి ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసరావుపేటకు చెందిన వీర్ల హనుమంతరావుకు ఇరువురు సంతానం ఉన్నారు. కుమారుడు సుభాష్ తండ్రితో పాటు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. హనుమంతరావు బంధువు సంపత్‌నగర్‌కు చెందిన వెంకటేష్ నివాసంలో నెలరోజుల క్రితం చోరీ జరిగింది. చోరీ వ్యవహారంపై లాలా పేట పోలీసులకు ఫిర్యాదు చేయకుండా హనుమంతరావు కుమారుడు సుభాష్‌పై అనుమానం వ్యక్తం చేశారు. సుభాష్‌ను వెంకటేష్, అతని స్నేహితుడు కళ్యాణ్‌లు పిలిపించి బంగారం చోరీ జరిగిన విషయంపై ఆరా తీయడంతో సుభాష్ నాకు ఎలాంటి సంబంధం లేదని చెప్పి వెళ్లిపోయాడు. ఈనెల 17వ తేదీన శ్రీనివాసరావుపేట సినీ ఫ్రైమ్ థియేటర్ సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న సుభాష్‌పై వెంకటేష్, కళ్యాణ్‌లు కర్రలతో దాడిచేసి గాయపరిచారు. స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించి అనంతరం సుభాష్ తండ్రి వీర్ల హనుమంతరావు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.